తైక్వాండోకు జై కొడుతున్నారు

- నగరంలో తైక్వాండో క్రీడకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న బాల బాలికలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



నగరంలో తైక్వాండో క్రీడలో శిక్షణ తీసుకుంటున్న బాల బాలికలు



సాధన చేస్తున్న క్రీడాకారిణి..

కర్నూలు (టౌన్): చదువుంటే చాలు మిగతావి ఏవీ అవసరం లేదు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు చదువుతో పాటు మిగతా రంగల్లో కూడా రాణించాలంటున్నారు. ఆ దిశగా పిల్లలను వారి తల్లిదండ్రులే ప్రోత్సహిస్తున్నారు. చాలా మంది క్రీడలపై ఆసక్తి పెంచుతున్నారు. అందులోనూ తైక్వాండో వైపు ప్రోత్సహిస్తున్నారు. ఆత్మవిశ్వాసం, ధైర్యం, విపత్కర పరిస్థితుల్లో తనను తాను రక్షించుకునేందుకు ఈ క్రీడ ఎంతో దోహదపడుతుంది. దీంతో నగరంలో ఈ క్రీడకు రోజురోజుకు ఆదరణ పెరిగిపోతుండటంతో ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియంలతో పాటు పెద్దమార్కెట్ మున్సిపల్ పార్కు, జొహరాపురం పార్కు, కిడ్స్ వరల్డ్, యునైటెడ్ క్లబ్, వీకర్‌సెక్షన్ కాలనీల్లో శిక్షణ శిబిరాలు వెలిశాయి. బాలలు, బాలికలు అన్న తేడా లేకుండా అక్కడ శిక్షణ పొందుతూ రాణిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. తరచుగా వివిధ స్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తూ ప్రతిభను వెలికితీస్తోంది. ఇటీవల ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా పోటీలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పేరుతో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు జరిగాయి. ఇందులో బాల బాలికలు పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

బాల బాలికల ఆసక్తిని గమనించి శిక్షణ



పిల్లల్లో మార్షల్ ఆర్ట్స్‌పై ఉన్న ఆసక్తిని గమనించి శిక్షణ ఇస్తున్నాం. దీంతో వారు క్రీడలో రాణించగలుగుతున్నారు. బాలలే కాకుండా బాలికలు కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే, క్వాలిఫైడ్ కోచ్ వద్ద శిక్షణ పొందితే భవిష్యత్‌లో ఎదిగేందుకు వీలు ఉంటుంది. ఒలింపిక్ సంఘం గుర్తింపు పొందిన ఈ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ వర్తిస్తుంది.

– షబ్బీర్ హుస్సేన్, నాలుగవ డాన్ బ్లాక్‌బెల్టు, జాతీయ రెఫరీ

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో బంగారు పతకం



ఇంటర్మీడియట్ చదువుతున్న వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన ఎస్. ఫహీమ్‌కు చిన్నప్పటి నుంచి తైక్వాండో అంటే ఎంతో ఇష్టం. దీంతో కోచ్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. చదువుతూనే తనకు ఇష్టమైన క్రీడలో రాణిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీఎస్‌జీఎఫ్) అండర్ 19 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. అలాగే రాష్ట్ర స్థాయిలో రజత పతకం కూడా తీసుకొచ్చాడు.

అండర్ 17 విభాగంలో ప్రతిభ



స్థానిక కల్లూరులోని స్కందాన్షి ఆలీవ్ గ్రీన్స్ కాలనీలో ఉండే వికాస్‌రాజ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్నాడు. సంతోష్‌నగర్‌లోని శ్రీలక్ష్మి ఇంగ్లిషు మీడియం పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న ఈ బాలుడు గత ఏడాది నవంబర్‌లో ఆళ్లగడ్డలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. 59 కేజీల విభాగంలో ఏకంగా బంగారు పతకం సాధించాడు. అలాగే కడప జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న మేదారివీధికి చెందిన రాధిక గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తైక్వాండో క్రీడపై ఆసక్తి పెంచుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో అండర్ -19 విభాగం (49 కేజీలు)లో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఇక అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రజత పతకం సాధించింది.

క్రీడల్లో రాణించాలి



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్

కర్నూలు (టౌన్): విద్యార్థులు, యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని అందులో రాణించాలని నగర పాలక డిప్యూటీ కమిషనర్ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన దాసరి సురేష్ మెమోరియల్ హాకీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేటి విద్యార్థులు చదువు, క్రీడలను సమానంగా చూడాలన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు గంగాధర్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్ పాల్గొన్నారు.

ఆర్చరీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు లక్ష్యాన్ని ఎంచుకుని రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపికయిన క్రీడాకారులు విజయవాడలో ఈనెల 28 నుంచి మార్చి 2 వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రవీంద్రారెడ్డిని గెలిపించండి



పాతబస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్) : శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన ఒకటో వార్డు ఖండేరి వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలసి తమ మొదటి ప్రాధాన్యత ఓటు రవీంద్రారెడ్డికి వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమారస్వామి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతి మృతిపై విచారణ జరపాలి



కలెక్టరేట్ ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న డాక్టర్ ప్రీతి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కైలాష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట డాక్టర్ ప్రీతి చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్ ఉన్న ప్రీతి ర్యాగింగ్ భూతానికి బలవ్వడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో నాయకులు నేణావత్ రాము నాయక్, బాలు నాయక్, రామచంద్రనాయక్, లాయర్‌బాలు నాయక్ పాల్గొన్నారు.

కంకర కార్మికులకు కొత్త వేతనాలివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న కంకర కార్మికులు

కర్నూలు(సెంట్రల్) : ఉల్లిందకొండలో కంకర పనులు చేసే కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కంకర కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామంలో దాదాపు 200 మంది కార్మికులు ఉన్నారన్నారు. వీరు ప్రతి రెండేళ్లకోసారి వేతనాలు పెరిగేలా కంకర క్రషర్ మిషన్ల యాజయాన్యాలతో ఒప్పందం చేసుకుంటారన్నారు. రెండేళ్ల పూర్తి కావడంతో కొత్త ఒప్పందానికి యజమానులు ముందుకు రాకపోవడంతో కార్మికులు పనులకు వెళ్లడం లేదన్నారు. అధికారులు స్పందించి కార్మికులు, యాజమాన్యాల మధ్య సయోధ్య కుదుర్చాలని కోరారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి మోటర్ వాహనాల చట్టం ఉల్లంఘనలపై తనిఖీలు నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లో ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 32 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.42,190 జరిమానా విధించారు. తనిఖీల్లో పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను సోమవారం సాయంత్రం కొత్తపేటలో ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇకపై అప్పగించేది లేదని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ నేత నక్కలమిట్ట శ్రీనివాసులు



సంఘీభావం వ్యక్తం చేస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): జనాభాలో 50 శాతంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని మార్చి 17వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మండల్ కమిషన్, కాలేకర్ కమిషన్ తమ నివేదికలు అందించినా, నేటి వరకు దేశంలో బీసీ జన గణన జరగలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ జన గణన జరగకపోవడం వల్ల బీసీలు అనేక రూపాల్లో నష్టపోతున్నారన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బీసీలకు ప్రత్యేకించి మంత్రిత్వ శాఖ లేకపోవడం దారుణమన్నారు. పలుమార్లు ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వానికి వివిధ రూపాల్లో విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రంలో బీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, ఆనంద్‌బాబు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

- అధికారులతో కలెక్టర్ పి.కోటేశ్వరరావు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఇతర అధికారులు

కర్నూలు(సెంట్రల్): బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌బీసీసీ(సోషల్ అండ్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్)సెల్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నివారణ, కౌమార బాలికల్లో రక్తహీనత నిర్మూలన, మాతాశిశు మరణాలను తగ్గించడం, పాఠశాలలకు వెళ్లని విద్యార్థులను తిరిగి పంపడం ఎస్‌బీసీసీ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటైన ఎస్‌బీసీసీ కమిటీలను మండల స్థాయిలోనూ ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిపించడంతో పిల్లల బంగారు భవిష్యత్‌ను ఏ విధంగా నష్టపోతారో వీడియో రూపంలో చిత్రీకరించి ఆరోగ్య శాఖ మొబైల్ వాహనాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. అలాగే థియేటర్లలో స్లైడ్స్ రూపంలో వేయించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాలపై బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై ఆడియో రూపంలో స్పీకర్ల ద్వారా తెలియజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాల బయట ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ బోర్డులను డిస్ప్లే చేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, ఐసీడీఎస్‌పీడీ కుమారి, మెప్మా పీడీ శివలీల, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, డీఈఓరంగారెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వైనతేయ ఇష్టి



అనుగ్రహ భాషణం చేస్తున్న అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో సోమవారం వైనతేయ ఇష్టి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపనను పురష్కరించుకుని అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆగమసార్వభౌమ మద్దాళుల సముద్రాల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో యజ్ఞాలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ధార్మిక సంస్థల సభ్యులు, భజన మండళ్లు అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. రేణుశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రుక్మిణి పాండురంగ స్వామి పీఠాధిపతులు ఎల్లప్ప స్వామి, వైద్యం రామానాయుడు, పరివారం పాల్గొన్నారు.

పని తీరును చూసి ఓటు వేయండి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేసే అభ్యర్థులకే ఓట్లేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న కోరారు. సోమవారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆరు సంవత్సరాల పని తీరు నివేదికను ఆయన విడుదల చేశారు. సమావేశంలో ఆ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సన్యూర్తి, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణుమాలయన్



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణుమాలయన్

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణుమాలయన్ అన్నారు. విశ్వ హిందూ పరిషత్ విశిష్ట వ్యక్తుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం మాతృమూర్తిలాంటిదన్నారు. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ సమాజ రక్షణకోసం, ధర్మం కోసం మన సంపాదనలో కొంత సమర్పించాలన్నారు. దేశవ్యాప్తంగా 68,682 కమిటీలతో ప్రపంచంలోని సుమారు 125 దేశాల్లో వీహెచ్‌పీ శాఖలు కలిగి ఉందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర సంఘటనా మంత్రి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు మాళిగి వ్యాసరాజ్, కోశాధికారి సందడి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ కోశాధికారి శ్రీనివాసరెడ్డి, సహకార్యదర్శి శివప్రసాద్, బజరంగ్ దళ్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, విభాగ్ సేవా ధర్మ ప్రసార్, వివిధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

రూపాల సంగమేశ్వరాలయం హుండీ కానుకలు లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

కర్నూలు కల్చరల్: జగన్నాథ గట్టు ఉమా సమేత శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి భక్తులు కానుకలు చెల్లించారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరెడ్డి, కార్య నిర్వహణాధికారి వై.గురెడ్డి సమక్షంలో వాటి లెక్కింపు చేపట్టగా రూ.3,12,233 ఆదాయం వచ్చింది. కౌంటింగ్‌లో దిన్నెదేవరపాడు గ్రామ సర్పంచ్ మాధవ్‌స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సర్వేశ్వర్‌రెడ్డి, శేషయ్య, అర్చకులు లంక సురేష్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను తరిమేద్దాం

కర్నూలు సిటీ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (ఏఐడీఎస్ఓ)ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ హైస్కూల్‌లో మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ కర్నూలు ఇన్‌చార్జ్ పి.విశ్వనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అంశాలపై అవగహన కల్పించారు. మూఢనమ్మకాలను సమాజం నుంచి పారద్రోలాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ నాయకులు మల్లేష్, తేజోవతి పునీత్, తదితరులు పాల్గొన్నారు.

ఆ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలుగా ఉన్న కాలేజీల్లో సరైన ల్యాబ్ సౌకర్యం లేని వాటినపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం ఇంటర్ బోర్డు ఆర్ఐఓ గురవయ్యశెట్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో చాలా ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ల్యాబ్ సౌకర్యం లేవని, ప్రాక్టికల్స్ పేరుతో అడ్డగోలుగా ఆయా కాలేజీలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. దీనిపై విచారణ చేసి సదరు విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రవీంద్రనాథ్, రమణ, నరేష్, విష్ణు, రాము, అయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నకిలీ పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్

కర్నూలు(సెంట్రల్): దొంగ పత్రాలు సృష్టించి పూర్వీకుల నుంచి వచ్చిన ప్లాట్‌ను తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆర్.అన్నయ్య అనే వ్యక్తి తెలిపారు. ఈ విషయంపై ఆయన సోమవారం జిల్లా ఎస్పీ సిద్దార్థకౌశల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 1982లో బి.తాండపాడు సర్వే నంబర్ 19/1 336, 337లో తమ తండ్రికి 48వ ప్లాట్‌కు సంబంధించి డి- పట్టాను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నకిలీ పత్రాలతో ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

జిల్లా కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్) : అవాజ్ నూతన జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ ముస్తఫా, ఎస్‌ఏ సుభాన్‌లతోపాటు ఉపాధ్యక్షులుగా పి.ఇక్బాల్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, సహాయ కార్యదర్శులుగా ఎస్ఎండీ షరీఫ్, మహ్మద్ రఫీలను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ఎస్‌ఏ సుభాన్ ఓ ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు పట్టణంలో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు ఏడునెలల పెండింగ్ వేతనాలు సత్వరమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటే కార్మికులు కుటుంబాలను పోషించుకునేది ఎలా అని ప్రశ్నించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బి.రాజు, మంజుల, దేవమ్మ, కోశ్వరమ్మ, నాగమణి, నాగరాజు, సుకన్య పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం ఈ.తాండ్రపాడులో రెండు నెలలుగా ప్రజా పంపిణీ ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయడంలేదని ఆ గ్రామ సర్పంచ్ పీబీ హుస్సేన్ చెప్పారు. వచ్చే నెల నుంచి పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎండీయూ వాహనం డ్రైవర్‌ను అధికారులు సస్పెండ్ చేయడంతో గ్రామంలో రేషన్ సరఫరా నిలిచిపోయిందన్నారు. వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ రాజారఘువీర్ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, శాలన్న, రాముడు, రామతులసి, సాయిబాబా, మధు, ఎల్లమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే రథసారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: గృహసారథులు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో రథసారథులుగా పని చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

కర్నూలు (న్యూటౌన్): రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. సోమవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిరు పేద కుటుంబాలకు ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

డీజిల్ సరఫరాకు దరఖాస్తులు సమర్పణ

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ డిపోలకు డీజిల్ సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో మొత్తం ఐదు డిపోలకు 8 మంది నుంచి 12 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు వేసేందుకు అధికారులు సమయం ఇచ్చారు. ఆ తర్వాత టెండరు బాక్సు తెరిచి పరిశీలించగా అందులో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఎండీ కార్యాలయానికి పంపించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సూచనల మేరకు మిగతా ప్రక్రియ నిర్వహిస్తామని రీజినల్ మేనేజరు వెంకటరామం పేర్కొన్నారు.

కనీస పెన్షన్ రూ.6500 ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఈపీఎఫ్ పింఛన్‌దారులకు వేతనంతో సంబంధం లేకుండా కనీస పెన్షన్ రూ.6,500 ఇవ్వాలని గ్లాస్ ఫ్యాక్టరీ కార్మికులు సాయిబాబు, సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన పెన్షన్ అవగాహన సదస్సులో వారు పూర్వపు అసిస్టెంట్ కమిషనర్ ఎ.రవీందర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేర్ వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, కొకైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ : డెడ్‌లైన్ **విజయ :** సార్